క్లుప్తంగా

మమ్మేలు మరిడమ్మ



బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పెద్దాపురం మరిడమ్మ వారు పేరొందారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు శుక్రవారం కావడంతో బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు బాపిరాజు మృతి



సామర్లకోట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోలి బాపిరాజు (55) శుక్రవారం మృతి చెందారు. వేట్లపాలేనికి చెందిన ఆయనకు ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో చనిపోయారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో చురుకైన నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బాపిరాజు కుటుంబానికి దొరబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాపిరాజు మృతికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు సంతాపం తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల సంఘాల అధ్యక్షుల నియామకం

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం గొల్లప్రోలు మండల పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. యూత్ విభాగ అధ్యక్షుడిగా ఒమ్మి మల్లిఖార్జునరావు, మహిళా విభాగానికి ఖండవల్లి జ్యోతి, రైతు విభాగానికి లోకారెడ్డి అప్పన్నదొర, బీసీ సెల్‌కు నూజివీడు సూర్య, ఎస్సీ సెల్‌కు ఎద్దు లోవరాజు, ఎస్టీ సెల్‌కు పంజాబు సత్తిబాబు, మైనారిటీ సెల్‌కు షేక్ జిలాని, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు బందా భగవాన్, స్టూడెంట్ విభాగానికి ఏడిద నరేష్‌ను నియమించారు. అలాగే పంచాయతీ రాజ్ విభాగానికి ముద్దునూరు కొండ బాబు రాజు, ఆర్టీఐ విభాగానికి మాచెర్ల శ్రీనివాస్, వలంటీర్ విభాగానికి చిలకల సతీష్, వీవర్స్ విభాగానికి శీరం అబ్బు, వాణిజ్య విభాగానికి కందా పేర్రాజు, వైఎస్సార్‌టీయూసీ విభాగానికి నెల్లి రామేశ్వరరావు, కల్చరల్ విభాగానికి తీర్ల నేరియ్య, సోషల్ మీడియాకు ఓరుగంటి సత్య నూకరాజు, దివ్యాంగుల విభాగానికి ఓరుగంటి శ్రీను, పబ్లిసిటీ విభాగానికి ఓరుగంటి ప్రసాద్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

సామర్లకోట: స్థానిక జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి బదిలీ అయిన హెచ్ఎం యు.మీనామాధురి విశేష కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఆమెను ఉపాధ్యాయులను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ చంటి మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో తరగతి గదులు వేగంగా పూర్తి చేయడానికి మాధురి ఎంతో కృషి చేశారన్నారు. ఆమె హెచ్‌ఎంగా ఉన్న సమయంలోనే జిల్లా పరిషత్తు హైస్కూల్ బాలికల జూనియర్ కళాశాలగా గుర్తింపు పొందిందన్నారు. పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు వాణి ప్రభ, భారతిలక్ష్మి, సుగుణ, శ్రీదేవి, హెచ్‌ఎం మీనామాధురిలను సత్కరించారు. నూతన హెచ్‌ఎం రాయుడు విజయలక్ష్మి, ఎంఈఓ పి.పుల్లయ్య, మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, విద్యా కమిటీ వైస్ చైర్మన్ పి.లోవరాజు, మాజీ చైర్మన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణే లక్ష్యం



స్టాప్ డయేరియాపై ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్ 'స్టాప్ డయేరియా' ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అతిసారం కారణంగా చిన్న పిల్లల మరణాలను పూర్తిగా నివారించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. అనంతరం స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. కాకినాడలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు.

అవినీతికి రహదారి!

- మూణ్నాళ్లకే పాడవుతున్న రోడ్లు
- నెల రోజుల్లోనే బయటపడుతున్న డొల్లతనం



వాహనాలు వెళ్లడంలో లేచిపోతున్న గొల్లప్రోలు నుంచి తాటిపర్తి వెళ్లే పుంత రోడ్డు

పిఠాపురం: అభివృద్ధి ముక్కలైంది.. ఆనందం నెల రోజుల్లోనే ఆవిరైంది.. నిత్యం రైతుల రవాణా వాహనాలతో రద్దీగా ఉండే ఆ రోడ్లు ఎట్టకేలకు ప్రగతి బాటపట్టినా మళ్లీ యథాస్థానానికి చేరుతున్నాయి. నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో వేసిన మూణ్నాళ్లకే ముక్కలవుతున్నాయి. గొల్లప్రోలు నగర పంచాయతీని ఆనుకుని ఉన్న 216 జాతీయ రహదారి నుంచి గొల్లప్రోలు మండలం తాటిపర్తి వెళ్లే పుంత రోడ్డును ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో తారు రోడ్డుగా నిర్మించారు. దీనికి రూ.1.47 కోట్లు వెచ్చించారు. అలాగే గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి పిఠాపురం మండలం పి.రాయవరం వెళ్లే పుంత రోడ్డును రూ.1.47 కోట్లతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఒక్కో రోడ్డును మూడు విభాగాలుగా విడదీసి ఒక్కోదానికి రూ.49 లక్షల చొప్పున ఖర్చు చేసినట్లు చూపించారు. ఇందులో ఉపాధి కూలీలకు పని చెప్పినట్టు రికార్డుల్లో నమోదు చేసిన అధికారులు మెటీరియల్‌కు రూ.48.72 లక్షల ఖర్చు చూపించారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసి వేసిన ఈ రహదారులు నెల రోజులు కాక ముందే ముక్కలవుతున్నాయని రైతులు అంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల రోడ్డు మార్జిన్ల వద్ద పగుళ్లు ఏర్పడి ముక్కలుగా విడిపోతోంది. ఇలా విడిపోయిన రోడ్డు కనిపించకుండా అధికారులు గ్రావెల్‌ను వేసి కప్పిపుచ్చుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

నాణ్యత లేక వెతలు

నిత్యం రైతులు తమ పొలాలకు వ్యవసాయ పనిముట్లు, పశువులు, ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లను ఈ రోడ్ల మీదుగానే తీసుకెళ్తుంటారు. అలాంటి రోడ్డును ముందుగా పటిష్ట పరిచి దానిపై తారు రోడ్డు వేయాల్సి ఉండగా, పాత దానిపై ఎక్కడా ఎటువంటి ముందు చర్యలు తీసుకోకుండా నేరుగా తారు రోడ్డు వేసేశారు. దీంతో నెల రోజులు తిరగక ముందే ఎక్కడికక్కడ ముక్కలుగా విడిపోతోందని రైతులు చెబుతున్నారు. రోడ్డును పల్చగా వేసినట్లు చూస్తే ఇట్టే అర్థమవుతుందని, వర్షం వస్తే అసలు కనిపించకుండా పోతుందని అంటున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసినా పటిష్టత కనిపిడం లేదని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని చెబుతున్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లను సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.

విచారణ జరిపించాలి



216 జాతీయ రహదారి నుంచి గొల్లప్రోలు మండలం తాటిపర్తి వెళ్లే పుంత రోడ్డు నిర్మాణంలో నాణ్యత కరవైంది. దానిపై విచారణ జరిపించాలి. వాణిజ్య పంటల భూములు ఉండే ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చాలా పటిష్టంగా ఉండాలి. కాని కాలితో గీసినా రోడ్డు ఊడిపోతోంది. తారు కూడా సక్రమంగా వాడకపోవడంతో కొద్ది రోజుల్లోనే ముక్కలవుతోంది. ఇంత దారుణంగా రోడ్డు వేయడం ఇప్పటి వరకూ చూడలేదు. దీనిపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– ఉలవకాయల నాగ లోవరాజు, జెడ్పీటీసీ, గొల్లప్రోలు



బీటలు వారుతున్న గొల్లప్రోలు నుంచి తాటిపర్తి వెళ్లే పుంత రోడ్డు

వంద రోజుల పని కల్పించాలి



ఉపాధి శ్రామికులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని పాత ఇసుకపల్లిలో శుక్రవారం మన ఊరు – పనితీరు, పారదర్శక బోర్డులను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఎస్ఆర్పీలు, డీఆర్పీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, విద్య, సమాచార వ్యవస్థ, లక్ష్యాలు, ప్రయోజనాలు, నూతన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ కొండలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి అధికారులపై ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. రోజువారీ వేతనంగా రూ.307 వచ్చేలా చూడాలన్నారు. సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ, డీఆర్పీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారుడికి సత్కారం



గిడుతూరి శ్రీనివాస్‌ను సత్కరించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: నియోజకవర్గ సకల కళా సమాఖ్య అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాస్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రజలకు వినోదం అందించే విధంగా తరచూ గాన విభావరిలు ఏర్పాటు చేస్తూ, ఘంటసాల, బాలు పాటలను పాడుతూ స్థానికులను ఉత్తేజపరుస్తుండడంతో శుక్రవారం స్థానిక బళ్లమార్కెట్‌లోని శ్రీలక్ష్మీ శ్రీనివాస కల్యాణ మండపంలో శ్రీకనక మహాలక్ష్మి ఆలయ ధర్మకర్త యంద్రు రాము అధ్యక్షతన ఆయన్ని సత్కరించారు. మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడి ఉంటూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు తరచూ గాన విభావరిలు ఏర్పాటు చేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు వేగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏ భక్తుడూ ఆకలితో వెళ్లకూడదు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ వారి ఆలయానికి ఆషాఢ మాస జాతరకు వచ్చే ఏ ఒక్క భక్తుడు ఆకలితో వెళ్లకూడదని, దేవదాయ శాఖ అన్నదానానికి శ్రీకారం చుట్టాలని మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం దేవదాయ శాఖను కోరింది. జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన యాత్రికులకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, ఈఓ విజయలక్ష్మి, ఎస్సై మౌనిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెద్దిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ బాబు, ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ వచ్చే ఏడాది జాతరకు తప్పకుండా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. నాయకులు తూతక రాజు, లక్ష్మణ్, తమనారా, జట్ల విజయ్, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సభ్యులు హైదర్ అలీ, జయశ్రీ, సత్యప్రశాంత్, నవీన్‌నాని, లక్ష్మి, నాగలక్ష్మి, సందీప్, ఉమాశంకర్, సత్యరాణి తదితరులు పాల్గొన్నారు.

కౌలుదారుని నుంచి భూమి స్వాధీనం



బోయనపూడిలో భూమిని స్వాధీనం చేసుకున్న దేవదాయ శాఖాధికారులు

సామర్లకోట: దేవదాయ శాఖకు చెందిన భూమిని కౌలుదారు నుంచి ఆ శాఖాధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను స్థానిక విలేకరులకు కాకినాడ బొగ్గవరపు సుబ్బారావు సత్రానికి చెందిన ఈఓ జి.శివబాబు వెల్లడించారు. సత్రానికి చెందిన రెండెకరాల 39 సెంట్ల సాగు భూమి సామర్లకోట మండలం బోయనపూడిలో ఉందన్నారు. ఆ భూమిని కౌలు ద్వారా సాగు చేసుకోవడానికి 2007లో బహిరంగ వేలం నిర్వహించామన్నారు. దాంతో బోయనపూడి గ్రామానికి చెందిన అడబాల వెంకట సత్యనారాయణ హెచ్చు పాటదారునిగా మూడేళ్ల పాటు (2010 వరకూ) సాగు చేసుకోవడానికి హక్కు పొందాడన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి కౌలు కోసం బహిరంగ వేలం నిర్వహించడానికి 2010లో నోటీసు జారీ చేయగా, కౌలుదారుడు ఖాతారు చేయకుండా సాగు చేసుకొంటున్నాడన్నారు. 2016లో ఖాళీ చేయడానికి ఫైనల్ నోటీసు ఇవ్వగా కౌలుదారుడు కోర్టును ఆశ్రయించాడని చెప్పారు. ఆ భూమి దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని ఫిబ్రవరి 18న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దాంతో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారుల సమక్షంలో బోయనపూడి గ్రామంలోని భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ఈఓ వివరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీఈఓ కె.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ వి.ఫణికుమార్, దేవదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారులు బళ్ల నీలకంఠం, ఎం.వీరభద్రరావు, కె.వేణు, వీఆర్వో సంజీవ్ పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాల్సిందే



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌శంకర్

పెద్దాపురం: పట్టణంలో ఆటో డ్రైవర్లు, వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని విజయ్‌శంకర్ అన్నారు. స్థానిక సామర్లకోట రోడ్డులోని క్రీడా మైదానంలో శుక్రవారం పట్టణ ఆటో డ్రైవర్లకు ఎస్ఐ మౌనిక అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌శంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ఆటో డ్రైవర్లు తమ అతి వేగాన్ని నియంత్రించుకోవాలన్నారు. పెద్దాపురం పట్టణంలో 495 ఆటోలు ఉన్నాయని, డ్రైవర్లు విధిగా ఖాకీ షర్ట్ ధరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు

పిఠాపురం: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత గ్రామ స్థాయి కమిటీలదేనని బాలల జిల్లా పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు తెలిపారు. జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ, పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్‌కే దుర్గాదేవి అధ్యక్షతన గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ స్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులకు మండల స్థాయిలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీలు బాల్య వివాహాల నివారణపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బాలల స్నేహపూరిత కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నెలా మొదటి, 3వ శుక్రవారం గ్రామ స్థాయిలో సమావేశాలను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలతో పాటు ప్రభుత్వం నుంచి పొందే అన్ని పథకాలు కోల్పోతారని తెలిపారు. 18 ఏళ్లు నిండకుండా మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇచ్చే వార్డు అడ్మిన్ సెక్రటరీలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి విజయ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసేవారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారన్నారు. చిన్నతనంలో పెళ్లిళ్లు చేస్తే బాలికలు వివిధ రకాల ఆరోగ్య, శారీరక, మానసిక ఇబ్బందులకు గురవుతారన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి , ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కె.మానసాదేవి, ఎం.దేవకుమారి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా... పట్టదా!



సామర్లకోట సంత మార్కెట్ వద్ద తవ్విన గొయ్యిలో వృథాగా పోతున్న తాగునీరు

సామర్లకోట: తాగునీటి వృథా... అధికారులకు పట్టడం లేదు. సామర్లకోట సంత మార్కెట్ వద్ద గత రెండు నెలలుగా తాగునీరు వృథాగా పోతోంది. ఇక్కడ ప్రధాన పైపులైన్‌కు లీకులు ఏర్పడడంతో లీకులు నివారించడానికి 15 రోజుల క్రితం గోతులు తవ్వారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపారు. ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టర్ ప్లాంటు నుంచి ప్రధాన పైపులైన్ సంత మార్కెట్ మీదుగా కొట్లమ్మ చెరువు వద్ద ఉన్న ట్యాంకులు నింపుతుందని తెలిపారు. దాంతో ఉదయం పంపింగ్ చేసే సమయంలో నీరు వృథాగా పోయి ట్యాంకులు నిండటం లేదన్నారు. దాంతో తాగునీటి నీటి ఎద్దడి ఏర్పడుతుందన్నారు. లీకులు నివారించడంలో సిబ్బంది వైఫల్యం చెందారని అన్నారు. పైపులైన్ లీకులు నివారించడానికి తవ్విన గొయ్యి పెద్ద డ్రైన్‌గా మారిపోయింది. సంత మార్కెట్ వద్ద తవ్విన గొయిలో లీకులు ఉండటంతో బురద లీకుల ద్వారా పైపులైనులోకి ప్రవేశించి ప్రజలకు ఆ నీరే వస్తుందని వాపోయారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని అంటున్నారు. ఈ గొయ్యి నిండిపోవడంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హరిబాబు అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి



పెద్దాపురప్పాడులో సామాజిక అంశాలపై వివరిస్తున్న కనకాంబరం

కరప: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని హెచ్ఎం వైసీహెచ్ఎస్ రావు అన్నారు. పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, జండర్ ఆధారిత హింస, భద్రతా చట్టాల గురించి వివరించారు. మహిళా మండలి కోఆర్డినేటర్ పీఎస్ఆర్ కనకాంబరం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అంశాలను ఆకళింపు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు టి.వెంకట్రావు, ఎం.అపర్ణాదేవి, భీమాబాయి మహిళా మండలి ప్రోగ్రామ్ ఆర్గనైజర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎరువు.. కరవు

- పక్కదారి పట్టిన సొసైటీ ఎరువులు
- డీలర్ల సమ్మెతో క్లిష్ట పరిస్థితిలో రైతులు



పీబీ దేవం సొసైటీ వద్ద ఎరువుల కోసం పోటీ పడుతున్న రైతులు

సామర్లకోట: రైతులకు సకాలంలో ఎరువులు అందకపోవడంతో విలవిల్లాడిపోతున్నారు. పీబీ దేవం, జి.మేడపాడు, వేట్లపాలెం గ్రామాలకు చెందిన రైతులకు ఎత్తిపోతల పథకాల ద్వారా ముందుగా సాగు ప్రారంభించారు. దాంతో వరినాట్లు పూర్తి కావడంతో రైతులు ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో శుక్రవారం పీబీ దేవం గ్రామంలోని సొసైటీకి 400 బస్తాల డీఏపీ రాగా వచ్చిన కొద్దిసేపటికి సరకు పంపిణీ అయిపోయిందని రైతులు వాపోయారు. రైతులు కానివారికి ఎరువులు విక్రయించడం ద్వారా అవి పక్కదారి పట్టాయని రైతులు ఆరోపిస్తున్నారు. వరి నాట్లు వేసిన పొలాలకు తప్పని సరిగా డీఏపీ కావాల్సి ఉండగా ఎక్కడా లభించని పరిస్థితి ఏర్పడిందని సొసైటీ మాజీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల డీలర్లు అధిక ధరలకు అమ్ముకోవడానికి సమ్మె చేయడంతో రైతులకు ఎరువులు అందని పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలోనూ ఒకటి నుంచి రెండు రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉంచడంతో ఇబ్బంది ఉండేది కాదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న ఏ రైతు భరోసా కేంద్రంలోను ఎరువులు లేవు. డీఏపీతో పాటు యూరియా కావలసి ఉంది. సొసైటీ ద్వారా డీఏపీ రూ.1,350 ఉండగా డీలర్లు రూ.1,450కి అమ్మేవారు. యూరియా సొసైటీ ద్వారా రూ.270 ఉండగా డీలర్లు రూ.320కి విక్రయించే వారు. అధిక ధరకైనా కొందామంటే ఎరువులు అందుబాటులో లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్‌ను వివరణ కోరగా పీబీ దేవం సొసైటీకి వచ్చిన ఎరువులను రైతులకే విక్రయించినట్టు సొసైటీ సిబ్బంది సమాచారం ఇచ్చారన్నారు. రైతుల నుంచి వేలి ముద్రలు సేకరించి ఎరువులు విక్రయిస్తారన్నారు. స్టాక్ అయిపోవడంతో వెంటనే ఆర్డర్ చేయాలని సొసైటీ సిబ్బందికి సూచించానన్నారు. అధిక ధరలకు విక్రయించడానికి వీలులేదనే ఆదేశాల మేరకు డీలర్లు సరకు తీసుకు రావడం లేదన్నారు.

వేధింపులకు గురిచేసిన వారిని శిక్షించాలి



పెద్దాపురంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: రంగరాయ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సీఐటీయూ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు బేబీ మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించి, విద్యార్థినులకు రక్షణ కల్పించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వేధింపుల నిరోధక కమిటీలు వేసి సక్రమంగా పని చేయించాలని, జీజీహెచ్, ఆర్ఎంసీలలో సీసీ కెమేరాలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్నేహలత, సీత, చంటి, జ్యోతి, దేవి, ఇందిరా ప్రియదర్శిని, మున్నీ, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్, కృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీజీసెట్–25 ర్యాంకర్లకు అభినందన



పీజీ సెట్‌లో ప్రతిభ చూపిన పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో అధ్యాపకులు

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులు పీజీసెట్–25లో ప్రతిభ చూపారు. డిగ్రీలో వివిధ విభాగాలకు చెందిన 120 మందికి పైగా విద్యార్థులు ర్యాంకులు సాధించి పీజీ కోర్సులకు అర్హత సాధించారు. ఆ విద్యార్థులను శుక్రవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు అభినందించారు. పీజీ కోర్సుల్లో మంచి ఉత్తీర్ణత సాధించి మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు అకడమిక్ కో–ఆర్డినేటర్, హిందీ విభాగాధిపతి పసుపులేటి హరిరామప్రసాద్, విజయ్‌కుమార్, సీతఈ సంజీవ్‌కుమార్, కామర్స్ విభాగాధిపతి లక్ష్మణ్, ఫిజిక్స్ అధ్యాపకుడు జయదేవ్ అభినందించారు.

గేట్ క్లబ్‌తో కైట్ ఒప్పందం



హైదరాబాద్ గేట్ క్లబ్‌తో ఎంఓయూ కుదుర్చుకుంటున్న కైట్ కళాశాల ప్రతినిధులు

బోట్‌క్లబ్: స్థానిక కైట్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహిస్తున్న గేట్ ఎక్స్‌క్లూజివ్ కోచింగ్ నిమిత్తం పేరొందిన సంస్థ అయిన గేట్ క్లబ్, హైదరాబాద్ డాక్టర్ దశరథ్‌తో శుక్రవారం ఎంఓయూ చేసుకున్నారు. ఈ ఒప్పందం గేట్ పీజీ సెట్ ర్యాంకులు సాధించడానికి తోడ్పడుతుందని కైట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ రేవతి, రామకృష్ణ తెలిపారు. దశరథ్ మాట్లాడుతూ గేట్ పరీక్ష ద్వారా ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ఇతర ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందవచ్చన్నారు. కైట్ కళాశాలల చైర్మన్ పోతుల విశ్వం మాట్లాడుతూ విద్యార్థులు గేట్‌లో ర్యాంకు సాధిస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మంచి ఉద్యోగాలు సాధించవచ్చన్నారు.